చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులకు సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని పిలుపు

అమీర్‌పేట్, నవంబర్ 26: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల కూడా ఆసక్తి కనబర్చాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. తమ చదువులకు ప్రాముఖ్యతనిస్తూనే విద్యార్థులు ఇతర వ్యాపకాలైన క్రీడలు, సామాజిక సేవ, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అమీర్‌పేట్, ఖైరతాబాద్ మండలాల పరిధిలోని గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కొనసాగనున్న వార్షిక క్రీడోత్సవాలను ఎమ్మెల్యే తలసాని సనత్‌నగర్‌లోని కార్మిక సంక్షేమ కేంద్రం మైదానంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు తమ సత్తా చాటాలని సూచించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో దాదాపు 70కి పైగా పాఠశాలలకు చెందిన 3 వేల మంది విద్యార్థులు ఖోఖో, క్రికెట్, టగ్ ఆఫ్ వార్, చెస్, రన్నింగ్, స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొంటున్నారని గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు తెలిపారు. స్పోర్ట్స్ మీట్ ముగింపున విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు సంఘం ప్రతినిధులు డి.డి.ప్రశాంత్‌రాజ్ తెలిపారు.

స్పోర్ట్స్‌మీట్ ప్రారంభోత్సవంలో విద్యార్థులతో ఎమ్మెల్యే తలసాని

అధికారులు ప్రొటోకాల్ నిబంధనలు పాటించాలి

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్,నవంబర్ 26 : నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి తగిన కృషి చేస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు.సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మధురానగర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే కార్పొరేటర్లు, అధికారులు, నాయకులతో కలిసి చెక్కులను పంపిణీ చేశా రు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. పేద ప్రజల పిల్లల ఇబ్బందులను నివారించేందుకు గత ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. వివిధ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం తమ హామీలను నిలబెట్టుకొని వెంటనే అమలు చేయాలని పద్మారావు గౌడ్ డిమాండ్ చేశారు. అధికారులు ప్రొటోకాల్ నిబంధనలు ఉల్లంఘించి ప్రవర్తిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి అన్ని చెక్కుల పంపిణీ కార్యక్రమాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాని, సీతాఫల్‌మండిలోని జీహెచ్ఎంసీ ఫంక్షన్‌హాల్‌లో గాని ఏర్పాటు చేయాలని పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. మారేడ్‌పల్లి, ముషీరాబాద్ మండలాలకు సంబంధించిన దాదాపు రూ. కోటి 98 లక్షల విలువచేసే 198 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, ప్రసన్నలక్ష్మి, సునీత , శైలజ, నాయకులు హరి, రాజు, నారాయణ, శ్రీనివాస్, తహసీల్దార్లు భూపతి గౌడ్, ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్లతో కలిసి పంపిణీ చేస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ తదితరులు

ఎల్వోసీలు అందజేత

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన సువర్ణ వైద్య సహాయానికి రూ.రెండు లక్షలు, మెట్టుగూడ డివిజన్‌కు చెందిన అభినాష్ రూ.60 వేల మేరకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఎల్వోసీలను అందజేశారు.

పదవుల నియామకం

ఉస్మానియా యూనివర్సిటీలో పలు పరిపాలనా పరమైన పదవుల నియామకాలు చేపట్టారు. ఈ మేరకు వారికి ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ నియామక పత్రాలను అందజేశారు. ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ డీన్‌గా ప్రొఫెసర్ కె. కృష్ణ చైతన్య, ఆఫీస్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ (గతంలో యూనివర్సిటీ ఫారెన్ ఎఫైర్స్ ఆఫీస్) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బి. విజయ, అకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్

రమాదేవి, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ (లా)గా ప్రొఫెసర్ డి. రాధికా యాదవ్ నియమితులయ్యారు.

-ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 26:

'ఓయూలో కాంగ్రెస్ సంబురాలు సిగ్గుచేటు'

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 26: నిరుద్యోగులను నమ్మించి, మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ సంవత్సర కాలంలో ఆరు వేల ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చి ఓయూలో సంబురాలు చేసుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య అన్నారు. సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, నిరుద్యోగులను మాయచేసి గెలిచిన తరువాత వారిని విజయవంతంగా దగా చేసినందుకు సంబురాలు జరుపుతున్నారని ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, పరీక్షలు నిర్వహించి, ఫలితాలు విడుదల చేసిన ఉద్యోగాలకు ఆర్డర్ కాపీలు ఇచ్చి వాటిని తామే ఇచ్చినట్లు చెప్పుకోవడం ఏమిటని మండిపడ్డారు. ఎవరికో పుట్టిన పిల్లను తన బిడ్డగా చెప్పుకోవడం ఏమిటని దుయ్యబట్టారు.

దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలి

- బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్

బీఆర్ఎస్ పార్టీ జిల్లా సన్నాహక సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్‌తో సమావేశమైన కంటోన్మెంట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, స్థానిక నాయకులు

కంటోన్మెంట్, నవంబర్ 26: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలతో పాటు కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా కేసీఆర్ దీక్షా దివస్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ ప్రజల తరపున పోరాటాలు చేస్తామని కంటోన్మెంట్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 29న చేపట్టనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ భవన్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నుంచి టీఎన్ శ్రీనివాస్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009, నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతోనే తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరిందన్నారు. ఆయన దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేసిందన్నారు.తెలంగాణ భవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఆయా వార్డుల అధ్యక్షులు కిరణ్‌కుమార్, కుమార్ ముదిరాజ్, సీనియర్ నాయకులు పనస సంతోష్, మార్కెట్ మాజీ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, శర్విన్, మోండా డివిజన్ అధ్యక్షుడు ఆకుల రూపాహరికృష్ణ, ఉద్యమకారులు పెంట శ్రీహరి, సానాది శ్రీనివాస్, రమేష్, అబ్దుల్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

రైల్లో గంజాయి తరలింపు-నిందితుల అరెస్టు

- రూ.4.50 లక్షల విలువజేసే 18 కిలోల గంజాయి స్వాధీనం

మారేడ్‌పల్లి, నవంబర్ 26: రైల్లో గంజాయిని తరలిస్తున్న అంతర్‌రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ రాకెట్ గుట్టును రట్టు చేశారు సికింద్రాబాద్ రైల్వే పోలీసులు. నిందితుల వద్ద నుంచి రూ.4లక్షల 50 వేల విలువజేసే 18 కిలోల ఎండు గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ బి.సాయి ఈశ్వర్‌గౌడ్ వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ ప్రాంతానికి చెందిన ప్రీతమ్ చౌదరి(37), సత్యం చౌదరి(29) అన్నదమ్ములు.ప్రీతమ్ చౌదరి ముంబైలో పని చేస్తున్నప్పుడు షాలిమార్ నుంచి గంజాయిని దిగుమతి చేసి విక్రయిస్తున్నారని.. సులభంగా భారీగా డబ్బు సంపాదించవచ్చునని తెలుసుకున్నాడు. కాగా, దీపావళి పండుగకు తన సొంత ఊరికి వెళ్లిన ప్రీతమ్ చౌదరి తన సోదరుడు సత్యం చౌదరికి అక్రమ గంజాయి సరఫరా విషయం చెప్పాడు. దీనికి అతను ఒప్పుకోవడంతో ఇద్దరు కలిసి పశ్చిమ బెంగాల్‌లోని షాలిమార్‌లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి ఈ నెల 25న రైల్లో గంజాయిని సరఫరా చేస్తూ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు ఈనెల 26న ఉదయం 7:30 గంటలకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి ముంబైకి వెళ్లేందుకు రైలు కోసం ప్లాట్ ఫాం నంబర్-2లో ఎదురు చూస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. అనుమానాస్పద స్థితిలో ప్లాట్ ఫాంపై కనిపించిన నిందితులు ప్రీతమ్ చౌదరి, సత్యం చౌదరి బ్యాగ్‌లను తనిఖీలు చేశారు. అందులో గంజాయి ఉందని గుర్తించిన రైల్వే పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

అడ్వాన్స్‌డ్ డిప్లామా ఇన్ డేటా

సైన్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 26: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) ద్వారా అందించే అడ్వాన్స్‌డ్ డిప్లామా ఇన్ డేటా సైన్స్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఏఎస్ఎల్‌పీ కోర్సు పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్‌పీ (సీబీసీఎస్) రెండు, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 30 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 2లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓయూ గేట్లు తెరిచే సమయం పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ గేట్లు తెరిచి ఉంచే సమయాన్ని పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ భద్రతా సిబ్బందికి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థుల అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇకపై తార్నాక నుంచి శివం వైపుగా వెళ్లే రహదారిలో గేట్లను రాత్రి తొమ్మిది గంటల వరకు తెరిచి ఉంచనున్నారు. ప్రస్తుతం ఈ గేట్లను రాత్రి ఎనిమిది గంటలకే మూసివేస్తున్నారు. తాజా నిర్ణయంతో మరో గంట అదనంగా వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించారు. ఓయూ లో నిర్మాణ పనులు జరుగుతుండడంతో కూలీల పిల్లలు పాఠశాలకు వెళ్లేందుకు వెసులుబాటు కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశం అనంతరం సీనియర్ నాయకురాలు నివేదితను కలిసిన ఏడో వార్డు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కేబీ శంకర్ రావు,సాయి శీలన్, వినయ్,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. -బొల్లారం

దళితబంధు నిధులు విడుదల చేయాలి

మషీరాబాద్, నవంబర్ 26: దళితబంధు నిధులను వెంటనే విడుదల చేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపల్లి నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పేరుతో 17వేల కోట్లు కేటాయించి స్వయం ఉపాధి రంగాలకు కేటాయించిందని, యేడాదిన్నర గడుస్తున్నా ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల్లో స్వయం ఉపాధిరంగాలకు అంబేద్కర్ అభయ హస్తం పేరుతో ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని ప్రకటించి ఇంతవరకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యక్షురాలు సరస్వతి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు రాణి, ప్రభాకర్, సూరారం అశోక్, శ్రీకాత్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ విశ్వనగరంలో ఓయూ పాత్ర

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 26: హైదరాబాద్ మహానగరం విశ్వనగరంగా మారడంలో నగరంలో ఉన్న జ్ఞాన సంపద కీలకంగా పనిచేస్తుందని ప్రముఖ సీనియర్ సైన్స్ జర్నలిస్ట్ దినేష్ చంద్ర శర్మ అన్నారు. విశ్వనగరంగా మారడంలో ఉస్మానియా యూనివర్సిటీ పాత్ర ఎంతో ఉందన్నారు. ఓయూ, ఐఐసీటీ వంటి సంస్థలను చాలా కాలం క్రితమే నెలకొల్పడంతో పాటు దశాబ్దాలుగా ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాలు దీనికి తోడయ్యాయని అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగంలో పూర్వ విద్యార్థి అయిన దినేష్ చంద్ర శర్మతో ముఖాముఖి కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివృద్ధి క్రమాన్ని వివరించారు. ముందుగా పారిశ్రామికాభివృద్ధి ..ఆ తరువాత ఐటీ రంగంతో నగరం రూపమే మారిపోయిందని చెప్పారు. జర్నలిజం విద్యార్థులందరూ జర్నలిజంలో ఎదైనా ఒక ప్రత్యేక రంగాన్ని ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విభాగం హెడ్ డాక్టర్ టి. సతీశ్‌కుమార్, ప్రొఫెసర్ స్టీవెన్‌సన్ పాల్గొన్నారు.

దక్షిణాది జేఏసీ నూతన అనుబంధ కమిటీల ప్రకటన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 26: దక్షిణాది ఉద్యమాన్ని గ్రేటర్ హైదాబాద్‌లో విస్తరించేందుకు అనుబంధ కమిటీని ప్రకటించినట్లు డీజేఏసీ జాతీయ చైర్మెన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తెలిపారు. నగరంలో 59 దళిత కులాలను ఏకం చేస్తూ దక్షిణాది గ్రేటర్ హైదరాబాద్ దళిత సంఘాల జేఏసీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. తార్నాకలోని తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేఏసీ చైర్మెన్‌గా గట్టు అశోక్, గౌరవ అధ్యక్షుడిగా బూడాల విజయభాస్కరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఆంజనేయులు, ఉపాధ్యక్షులుగా మన్నె సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా జీజే రత్నం, సంయుక్త కార్యదర్శిగా ప్రభుదాస్‌లను నియమిస్తున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మషీరాబాద్, నవంబర్ 26: టీఎస్ఎస్పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ పార్శిగుట్ట, 44 నంబర్ బస్‌స్టాప్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా బుధవారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జీ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

*** ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు**

పార్శిగుట్ట ఫీడర్ పరిధిలోని ప్రేయర్ పవర్ చర్చి, రాంనగర్, బాప్టి చర్చి, బ్రహ్మంగారి టెంపుల్, ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్, గ్రేవియార్డు పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

*** మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు**

44 నంబర్ బస్‌స్టాప్ ఫీడర్ల పరిధిలోని చేపల మార్కెట్, 44 నంబర్ బస్ స్టాప్, గంగపుత్ర కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, రామాలయం అంజయ్య నాలా పరిసరా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

లష్కర్‌లో..

బేగంపేట్ : విద్యుత్ లైన్‌లో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్‌ల కారణంగా నేడు (బుధవారం) సికింద్రాబాద్ ప్యారడైజ్ ఏఈడీ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నట్టు ఎలక్ట్రిసిటీ అధికారులు తెలిపారు. నాగార్జున ఫీడర్ పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సండే మార్కెట్, నాగార్జున నగర్ షిర్డీసాయిన గర్, శ్రీనివాస అపార్ట్‌మెంట్, పార్కు ప్రాంతాల్లో పై విధంగా విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే దాల్‌మిల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయం త్రం 5 గంటల వర కు దాల్‌మిల్-1, గుడిమిల్లా విల్లా, నా గార్జున కమ్యూనిటీ హాల్, వైశాలి అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్టు అధికారులు తెలిపారు.

'క్రిస్టియన్ డే'ను సెలవుగా ప్రకటించాలి

అమీర్‌పేట్: బైబిల్ వచనం ప్రకారం లెక్కించబడిన సంఖ్య ఆధారంగా నవంబర్ 26న క్రీస్తును నమ్మిన విశ్వాసులను క్రైస్తవులుగా పిలవబడిన రోజుగా పరిగణిస్తూ, ప్రతియేటా ఈ రోజును క్రైస్తవులు క్రిస్టియన్ డేగా జరుపుకుంటున్నారని సీఎస్ఎస్, క్రైస్తవ జాతీయ నాయకులు పి.వి. యోహాన్, యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బ్రదర్ బి.జి.విలియమ్ పేర్కొన్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. నవంబర్ 26ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

భారత రాజ్యాంగం ప్రజలందరికీ సమానత్వం

చిక్కడపల్లి, నవంబర్ 26: భారత రాజ్యాంగం ప్రజలందరికీ సమానత్వం,స్వేచ్ఛ హక్కులు ప్రసాదించిందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, యువ నాయకుడు ముఠా జయసింహలు హాజరై అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముషీరాబాద్ నియోజకవర్గం డివిజన్ల బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్, శంకర్ ముదిరాజ్, రాకేశ్‌కుమార్, వల్లాల శ్యామ్ యాదవ్, శ్రీధర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి: బోరెల్లి సురేశ్

ఉస్మానియా యూనివర్సిటీ: 30 ఏళ్లుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మాలల మద్దతు పలికి రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేశ్ అన్నారు. ఎవరి జనాభా ఎంత ఉంటే వారికంత రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాలలోని అంబేద్కర్ విగ్రహానికి బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.

యువతరం భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

మారేడ్‌పల్లి: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని సీనియర్ అంబేద్కర్ వాది, స్టేట్ బ్యాంగ్ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు, విశ్రాంత అధికారి జేబీ రత్నం అన్నారు. పికెట్ లోని కంటోన్మెంట్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విశ్వ రత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కేడీ రమేష్, సంకి రవీందర్ బాబు, సదానంద్, నర్సింగ్‌రావు, సతీష్‌కుమార్, లెస్లీ, శ్యాం కుమార్, అరుణ్ కుమార్, అడ్వకేట్ రాజు పాల్గొన్నారు.

మారేడ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో..

అడ్డగుట్ట : రాజ్యాంగ దినోత్సవ వేడుకలను మారేడ్‌పల్లి తహసీశీల్దార్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భగా తహశీల్దార్ భీమయ్య గౌడ్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రాజు, సీనియర్ అసిస్టెంట్ మోహన్, సర్వేయర్ శ్రీనివాస్, స్పెషల్ ఆర్ఐలు సర్వేష్ సింగ్, స్వర్ణలత, కృతిక పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

ఓయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ లీసెర్చ్ సెంటర్‌లో ..

ఉస్మానియా యూనివర్సిటీ:భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించారు. ఓయూలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రీసర్చ్ సెంటర్‌లోని అంబేద్కర్, జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ మాట్లాడుతూ దేశ నిర్మాణం, సామాజిక న్యాయంలో అంబేద్కర్, పూలే అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్‌నాయక్, అంబేద్కర్ రీసర్చ్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మంగు, మైనారిటీస్ సెల్ డైరెక్టర్ డాక్టర్ సయీదా అజీమున్నీసా, ఏఎంఎస్ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కరుణాదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ వై. వసుంధర, డాక్టర్ కిరణ్మయి, రమణి, డాక్టర్ సరిత, సంధ్యారాణి పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ..

చిక్కడపల్లి : బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీఎస్ జడ్జికల్ అకాడమీ మాజీ డైరెక్టర్ డాక్టర్ మంగని రాజేంద్ర హాజరై రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు.

ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో..

సికింద్రాబాద్: 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని సికింద్రాబాద్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.సీతాఫల్‌మండి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ ,ఎస్టీ సంఘం ఆధ్వర్యంలో నాయకులు రాజ్యాంగ దినోత్సవా